


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 24 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 7



# ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయాలి

- బిల్లుల చెల్లింపుల్లో లోపాలు సరిదిద్దండి: ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి)** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ, మండల స్థాయి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాల్సిన బిల్లుల

మిగతా 2 లో...





# గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

- ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరేలా సకల సదుపాయాలు కల్పిస్తున్నాం
- పేదవారి పిల్లలు కూడా ధనికుల పిల్లలతో సమానంగా చదువుకోవాలి
- పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**మణుగూరు, ఏప్రిల్ 23, (ప్రజాజ్యోతి) :** విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం పరిధిలోని లంక మల్లారం గ్రామంలో టీటీఆర్‌జేసీ బాలికల డార్మెటరీ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందుగా రూ.1 కోటి అంచనా వ్యయంతో ప్రధాన బీటీ రహదారి నుండి పాఠశాల వరకు అప్రోచ్ బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యారంగానికి అత్యంత

మిగతా 2 లో...

# విధి నిర్వహణను సులభతరం చేసేందుకే స్మార్ట్ ఫోన్లు..

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్,ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి ):** అంగన్వాడీ టీచర్ల విధి నిర్వహణను సులభతరం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త స్మార్ట్ ఫోన్‌ను అందజేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.గురువారం మండలంలోని సారపాక వాసవి ఫంక్షన్ హాల్ లో బూర్గంపహాడ్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రేవతి అధ్యక్షతన జరిగిన అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో డిజిటల్ సాంకేతికత వినియోగం పెరిగి, పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు అందే సేవలు మరింత పారదర్శకంగా మారుతాయని పేర్కొన్నారు.అలాగే అన్ని అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.మండలంలో ఇప్పటికే పలు అంగన్వాడీ భవనాలు నిర్మించామని, నూతనంగా ఐటిసి సిఎస్ఆర్ నిధుల ద్వారా సారపాకలో మరో 4 అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలో ఉన్న 84 అంగన్వాడీ కేంద్రాల టీచర్లకు

మిగతా 2 లో...

# ఐటీడీఏ పీవో రాహుల్‌కు ఘన సన్మానం



**భద్రాచలం, ఏప్రిల్ 23, ప్రజా జ్యోతి:** ఇటీవల "ఆదివాసి వికాస్ రత్న" బిరుదు అందుకున్న ఐటీడీఏ పీవో, అడిషనల్ ఏజెంట్ టు గవర్నమెంట్ రాహుల్‌ను భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. గిరిజన ఉత్పత్తులను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో

మిగతా 2 లో...

# ధాన్యం కొనుగోలు కేంద్రాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

- రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలపై తక్షణ స్పందన
- అలసత్వం ప్రదర్శించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ



**పినపాక,ఏప్రిల్ 23(ప్రజాజ్యోతి):** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం భద్రాచలం మృణల్ శ్రేష్ఠ తో కలిసి పినపాక, కరకగూడెం మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పినపాక మండలంలోని ఏడుళ్ల బయ్యారం, పోతిరెడ్డిపల్లి, గోపాలరావుపేట, బోటిగూడెం కేంద్రాలను పరిశీలించారు. ఏడుళ్ల బయ్యారం కేంద్రంలో నిల్వలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం (మాయిశ్చర్ కంటెంట్) ను తనిఖీ చేశారు. కేంద్రంలో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోవడంపై

మిగతా 2 లో...

## ఐటీడీఏ పీవో రాహుల్‌కు ఘన సన్మానం

(మొదటి పేజీ తరువాయి...)

"భద్రగిరి మార్ట్"ను గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చినందుకు రాహుల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సున్నం రమేష్, కోశాధికారి రాము, సీనియర్ న్యాయవాదులు ప్రసాద్, మంత్రిప్రగడ గణపతి, పలివెల నరసింహారావు, పడిశిరి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, రవి, దానిసరి నరసింహమూర్తి, వలవల సురేష్‌కుమార్, కొరసా నరేష్, ఉజ్జగిరి రవి తేజ, రామ్మోహన్ రావు, దాట్ల సంధ్య, అంజలి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

చెల్లింపుల్లో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని సూచించారు. సాంకేతిక సమస్యల వల్ల బిల్లులు నిలిచిపోకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి పెండింగ్ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఇండ్ల నిర్మాణ బిల్లుల విషయంలో పేదలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందేలా పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, కమిషనర్ సుజాత, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణను సులభతరం చేసేందుకే స్మార్ట్ ఫోన్లు..

(మొదటి పేజీ తరువాయి...)

స్మార్ట్ ఫోన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, పంచాయతీరాజ్ టీ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్, మండల హౌసింగ్ శాఖ ఏఈ ఉదయ్ కిరణ్, టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ మహమూద్ ఖాన్, స్థానిక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్, సర్పంచులు మందా నాగరాజు, మంగమ్మ, పోతునూరి సూరమ్మ, మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ ఈవో మహేష్, ఇంగువ రమేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎడమకంటి సుధాకర్ రెడ్డి, భజన ప్రసాద్, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నర్సింగ్ సుదీప్

**టేకులపల్లి, ఏప్రిల్ 23, ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలం టీపీసీసీ సోషల్ మీడియా కో – ఆర్డినేటర్‌గా నియమితులైన నర్సింగ్ సుధీప్ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వు (అపోయింటెడ్ ఆర్డర్), స్వీకరించడం జరిగినది. నియక పత్రం అందుకున్న నర్సింగ్ సుదీప్ మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డికి, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## కలకలం రేపిన నకిలీ కరెన్సీ ఘటన

- **డిపాజిట్ చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు**

**అశ్వారావుపేట, ఏప్రిల్ 23, ప్రజాజ్యోతి :** అశ్వారావుపేటలో నకిలీ కరెన్సీ నోట్ల ఘటన వెలుగులోకి రావటం కలకలం రేపింది . నకిలీ నోట్లు బ్యాంకులో డిపాజిట్ చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని నెల్లూరుకు చెందిన పాలకుర్తి అంకయ్యపాల్ వారపు సంతల్లో ఫర్నిచర్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న అశ్వారావుపేటలోని ఎస్బీఐ బ్యాంకులో తన వద్ద ఉన్న రూ.14,500 నగదును డిపాజిట్ చేశాడు. డిపాజిట్ చేసిన మొత్తం రూ.500 నోట్లలో ఉండగా, అందులో 11 నకిలీ నోట్లను క్యాషియర్ గుర్తించాడు. అనంతరం ఈ విషయం బ్యాంక్ మేనేజర్ రాజేంద్ర నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. బ్యాంక్ మేనేజర్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ యాయతిరాజు తెలిపారు.

# గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

(మొదటి పేజీ తరువాయి...)

ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇటీవలే రూ.2 కోట్లు 70 లక్షల వ్యయంతో బాలికల వసతి గృహాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. పేదవారి పిల్లలు కూడా ధనికుల పిల్లలతో సమానంగా చదువుకోవాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ పాఠశాలలు మరియు రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విద్య పట్ల ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు అనేక నిదర్శనాలు ఉన్నాయని వివరించారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మంచి ఆహారం తీసుకుంటూ, మెరుగైన విద్యను అభ్యసించాలనే ఆశయంతో ప్రభుత్వం హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందన్నారు. ఇంటి వద్ద తల్లులు చేసే వంటల రుచిని గుర్తు చేసేలా పోషకాహారంతో కూడిన మెనూను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ అందించే ఆహారం విషయమై స్పష్టమైన ప్రణాళికతో హాస్టళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుపై పూర్తి విశ్వాసంతో ఉందని వారు తమ కాళ్ల మీద నిలబడి దేశాన్ని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగగలరని నమ్ముతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరికీ చదువు ఆగిపోకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. పేదవారి పిల్లలు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.65 కోట్ల వ్యయంతో ఏటీసీ కేంద్రాల ద్వారా వివిధ నైపుణ్యాలపై శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎలక్ట్రిషియన్, మెకానిక్ వంటి రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణల ద్వారా వారు స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వైద్య రంగంలో కూడా పేదవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. పేదల పక్షపాతిగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. ప్రభుత్వం మీ కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ మరియు సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వకంగా అభినందించారు. ఇదే విధంగా భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. పినపాక నియోజకవర్గంలో కూడా ఈ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు గిరిజన అభివృద్ధి కోసం అదనంగా 1000 ఇళ్లు మంజూరు చేసి నియోజకవర్గంలోని 380 గ్రామాలకు సుమారు 4500 ఇళ్లు ఆమోదించామని పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని, "అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ" ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకటరావు ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ డైట్ ఛార్జీలు పెంచి పోషకాహారం అందిస్తున్నదన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించబడుతున్నాయని ఈ అవకాశాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ"లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ వంటి వసతులను పూర్తి స్థాయిలో కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్లాసులు నిర్వహించి విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో శిక్షణ అందించనున్నామని తెలిపారు. పేరెంట్స్ మీటింగ్స్ ద్వారా తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతూ విద్యార్థుల డ్రాప్‌ఔట్ రేటును తగ్గించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువుపై దృష్టిసారించాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం 584 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. 16 గదులతో నిర్మించిన కొత్త డార్మెటరీ ద్వారా సుమారు 600 మందికి వసతి కల్పించగల సామర్థ్యం ఏర్పడిందన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉందని ఐఐటీ తదితర ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజన గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం రూ.53 కోట్లు మంజూరు చేయగా, భద్రాచలం ఐటీడీఏకు రూ.6 కోట్లు, ఈ పాఠశాలకు రూ.25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజన పాఠశాలల్లో కూడా డిజిటల్ తరగతులు నిర్వహించేలా తగిన సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూనెం రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి...)




అధికారులను ప్రశ్నించారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కలెక్టర్‌కు, 20 రోజులుగా ధాన్యం కొనుగోలుకు తీసుకువచ్చినా అధికారులు స్పందించడం లేదని, మిల్ ట్యాగింగ్ పూర్తి కాలేదని కారణాలు చెబుతున్నారని రైతులు వివరించారు. దీనిపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బాధ్యులపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్‌లు ప్రతిరోజూ తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు . పోతిరెడ్డిపల్లి వద్ద రైతులు కలెక్టర్ వాహనాన్ని ఆపి తమ సమస్యలను తెలియజేయగా, కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్, తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత డీసీఎంఎస్ అధికారిపై వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. బోటిగూడెం, బట్టుపల్లి కేంద్రాల్లో కూడా రైతులతో మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సదుపాయాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. రైతులకు నీడ, తాగునీరు, తూకం యంత్రాలు, టోకెన్ విధానం వంటి అన్ని మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. రైతుల నుంచి ధాన్యం స్వీకరణ సమయంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, తేమ శాతం పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. తూకం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, తూకం యంత్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. టోకెన్ విధానం ద్వారా రైతులకు సమయానుకూలంగా అవకాశం కల్పించి, ఎవరూ ఎక్కువ రోజులు వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్ ట్యాగింగ్, రవాణా ఏర్పాట్లు సమన్వయంతో జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 168 కొనుగోలు కేంద్రాల్లో చెక్‌లిస్ట్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు, టోకెన్ విధానం, నాణ్యత పరీక్షలు, తూకం ప్రక్రియ వంటి అంశాలను ప్రతిరోజూ పర్యవేక్షించి లోపాలను వెంటనే సరిదిద్దాలని సూచించారు. అనంతరం కరకగూడెం మండలంలోని కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, ధాన్యం గ్రేడ్, టోకెన్ విధానం, రైతులకు అందుతున్న సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా పినపాక మండలం తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న గోపాల్‌రావుపేట యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవనాల లేఅవుట్, తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తూ, పనులను నాణ్యతతో, వేగవంతంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణం కొనసాగాలని, ఎలాంటి అలసత్వం లేకుండా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఇన్‌వార్డ్, అవుట్‌వార్డ్ విభాగాలు, రక్తపరీక్ష కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై సమగ్రంగా ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి సమయపాలన పాటించాలని ఆదేశించారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అవసరమైన ఔషధాలు సమృద్ధిగా ఉన్నాయా అనే విషయంపై అధికారులను ప్రశ్నించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సహా అవసరమైన ఔషధాలను సమృద్ధిగా నిల్వలో ఉంచాలని సూచించారు. ప్రతి రోగికి తక్షణం, నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు విశ్వసనీయమైన వైద్య సేవలు అందించడం ఆరోగ్య శాఖ ప్రధాన బాధ్యత అని కలెక్టర్ అన్నారు . ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ అధికారులు, వైద్య శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విత్తనాలు తినడంతో బాలుడికి తీవ్ర సమస్య

- వైద్యుల చొరవతో తప్పిన ప్రమాదం



**చర్ల, ఏప్రిల్ 23: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం ఆశ్చర్యకరమైన వైద్య ఘటన వెలుగుచూసింది. పామేడుకు చెందిన 8 ఏళ్ల బాలుడు తీవ్రమైన కడుపునొప్పితో పాటు నాలుగు రోజులుగా మలవిసర్జన చేయలేకపోవడంతో కుటుంబ సభ్యులు చర్ల సి హెచ్ సి ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. డాక్టర్ రామ్ ప్రసాద్ పరిశీలించగా బాలుడి కడుపు బాగా ఉబ్బి ఉండటం గమనించారు. మలద్వారం ద్వారా పరీక్షించగా గట్టి రాళ్ల వంటి గడ్డలు ఉన్నట్లు గుర్తించారు. బాలుడు అడవిలో లభించే మురళి పండ్లను విత్తనాలతో సహా తిన్నట్లు తేలింది.దీనితో వైద్య బృందం వెంటనే చర్యలు చేపట్టి, మలద్వారం ద్వారా సుమారు 100 నుంచి 200 విత్తనాలను తొలగించారు. అయితే ఇంకా లోపల గడ్డలు ఉన్నట్లు గుర్తించడంతో మెరుగైన చికిత్స కోసం బాలుడిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఇలాంటి ఘటనలు గతంలో కూడా జరిగినట్లు వైద్యులు తెలిపారు. దాదాపు 10 సంవత్సరాల క్రితం 80 ఏళ్ల వృద్ధుడికి శస్త్రచికిత్స నిర్వహించి 300 నుంచి 400 విత్తనాలను తొలగించిన ఘటనను వైద్యులు గుర్తుచేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రాంప్రసాద్, పిల్లల వైద్యుడు డాక్టర్ రవికుమార్ తదితర సిబ్బంది చొరవతో తక్షణమే చికిత్స అందించి బాలుడి కి ప్రాణాపాయం తప్పించారు.గిరిజన ప్రాంతాల్లో అవగాహన లోపం కారణంగా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని వైద్యులు సూచించారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం



**చర్ల , ఏప్రిల్ 23: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని పెదమిడిసిలేరు గ్రామం లో గురువారం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న రైతులకు నమోదు ప్రక్రియ చేపట్టారు.ఈ సందర్భంగా చర్ల మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని పీఎం కిసాన్, రైతు భరోసా, యూరియా వంటి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి అని తెలిపారు.ఇప్పటివరకు మండలంలో సుమారు 55 శాతం మంది రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు వెంటనే ఏఈఓలు నిర్వహిస్తున్న గ్రామ క్యాంపెయిన్లలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే అందుబాటులో లేని రైతులు మీ సేవ కేంద్రాలను సంప్రదించి త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి (ఏ డి ఏ ) బి. సుధాకర్ రావు, వ్యవసాయ అధికారి (ఏ ఓ ) ఎస్. లావణ్య, సహాయ వ్యవసాయ అధికారి (ఏ ఈ ఓ ) బి. వినీల పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు రూ.30 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు సమర్పణ

- అందజేసిన సికింద్రాబాద్ కు చెందిన భక్తులు



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 23 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గురువారం సికింద్రాబాద్ లోని సీతారాంనగర్ కు చెందిన ఆదిత్య, వారి కుటుంబ సభ్యులు రూ.30 లక్షలు విలువ చేసే మూడు బంగారు ఆభరణాలను సమర్పించారు. ముందుగా వారు ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఈవో కె. దామోదర్ రావుకు బంగారు ఆభరణాలను అందజేశారు. ఈ ఆభరణాలను భద్రాద్రి రామయ్యకు నిర్వహించే వివిధ సేవల్లో ఉపయోగించాలని కోరారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలన




**బూర్గంపహాడ్,ఏప్రిల్23 (ప్రజా జ్యోతి ):** మండలంలోని కృష్ణ సాగర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను స్థానిక సర్పంచ్ తాటి వాణి,ఉప సర్పంచ్ భూక్య మోహన్ రావు గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు మూడు వాటర్ క్యాన్లను, మెడికల్ కిట్ ను అందజేశారు.గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో కీలకమని, ఈ పథకం ద్వారా గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అనంతరం డిఆర్డిఏ టిఏ ప్రసన్నకుమార్ తో కలిసి గ్రామపంచాయతీలోని మొక్కల నర్సరీని సందర్శించారు.అదేవిధంగా కృష్ణ సాగర్ ఎస్టీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి,హెచ్ఎం కోటేశ్వరరావు, భీముడు సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, పాలకవర్గం సభ్యులు రాజేష్,కృష్ణలీల,సురేష్,దేవయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ భూక్య హనుమంతరావు పాల్గొన్నారు.

## గోడిశాల రామనాథం జిల్లా ఉపాధ్యక్షులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన నాయకులు

- కష్టపడ్డ ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుంది: సర్పంచ్ అలివేలు



**పినపాక,ఏప్రిల్ 23(ప్రజాజ్యోతి ):** ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ పినపాక కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోడిశాల రామనాథం అధిష్టాన నిర్ణయం మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల పినపాక సర్పంచ్ అలివేలు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ వ్యక్తికి ప్రతిక్షణం అందుబాటులో ఉంటుందని, దానికి నిదర్శనమే గోడిశాల రామనాధానికి ఉపాధ్యక్ష పదవి ఇవ్వటమని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు గోడిశాల రామనాథం మాట్లాడుతూ తనకు జిల్లా ఉపాధ్యక్షులు ఇవ్వడం పట్ల సహకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారికి, రెవిన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారికి, అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్ పోదేం వీరయ్య గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తన కష్టాన్ని పార్టీ గుర్తించిందని, అందుకే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచ్ అరిగెల అలివేలు, ఉప సర్పంచ్ బోడ తిరపతయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల స్వతంత్ర రెడ్డి, కొంపెల్లి నగేష్, సోంబోయిన ప్రసాద్, కొండేరు సంపత్, మార్త మనోజ్, బాలసాని నరసింహులు, వేముల వరప్రసాద్, కోన శీను, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె

- అర్ధరాత్రి కార్మికుల టెంట్‌ను తొలగించిన పోలీసులు
- ఆర్టీసీ ఇన్‌గేటు వద్ద నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న కార్మికులు
- తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన





**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 23 , ప్రజాజ్యోతి ,** భద్రాచలంలో ఆర్టీసీ సమ్మె కొనసాగుతోంది. బుధవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఆర్టీసీ ఇన్‌గేటు వద్ద కార్మికులు నిరసన తెలిపేందుకు వేసుకున్న టెంటును తొలగించారు. ఈ సమయంలో టెంట్ తొలగించవద్దని విజ్ఞప్తి చేసినా పోలీసులు వినలేదు. అలాగే గురువారం నాడు డిపో ఇన్‌గేటు వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గూడూరు సత్యనారాయణ, భద్రాచలం ఆర్టీసీ జేఏసీ చైర్మన్ బర్ల మణారావులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండుల సాధించే వరకు సమ్మెను కొనసాగిస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో తమ మద్దతు తీసుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే విషయం మరిచిపోయిందని, గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను సైతం పట్టించుకోవడం లేదన్నారు. అలాగే సిబ్బందిని క్రమంగా తగ్గించేందుకు ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తున్నారని, జిల్లాల్లోని ఆర్టీసీ డిపోలలో సిబ్బందిపై పని ఒత్తిడి పెరగడంతో పాటు అనారోగ్య సమస్యలు పెరుగుతున్నా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. తమ డిమాండ్ల సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని అన్నారు. గురువారం భద్రాచలం ఆర్టీసీ ప్రాంగణం అంతా ఆంధ్రా బస్సులతో కళకళలాడింది. ప్రయాణీకులు సైతం ఎక్కువగానే కనిపించారు. ప్రయాణీకుల రద్దీని బట్టి మరింతగా బస్సులను పెంచే సూచనలు సైతం కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా భద్రాచలం డిపోకు చెందిన బస్సులు ఖమ్మం, కొత్తగూడెం, చర్ల మార్గాల్లో 22 అద్దె బస్సులు, 23 ఆర్టీసీ బస్సులను కాంట్రాక్టు డ్రైవర్లతో నడిపారు. అలాగే కొందరు తాత్కాలిక కండక్టర్లను సైతం విధుల్లోకి తీసుకొని వారితో బస్సుల్లో టికెట్లు కొట్టిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కేకే ప్రసాద్, యాకయ్య, ఎం.ఎస్.రావు, జున్ను రవి, పోకల సురేష్‌లు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



**చంద్రుగొండ, ఏప్రిల్ 23, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం గానుగపాడు గ్రామానికి చెందిన పనితి వెంకటేశ్వర్లు (55) వృత్తి రీత్యా వ్యవసాయ కూలీ, బుధవారం తన ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసి ఇంటి చుట్టూ కంచె కట్టే క్రమంలో వడదెబ్బకు గురయ్యాడు. దీంతో వాంతులు విరేచనాలు కావడంతో 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వాంతులు విరోచనాలు ఎక్కువ అవడంతో రాత్రి 12 గంటలకు సమయంలో 108 వాహనం ద్వారా కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వెంకటేశ్వర్లు ను పరిశీలించి చూడగా అప్పటికే మృతి చెందినట్లుగా తెలిపారు. దీంతో ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య గౌరమ్మ, కుమారుడు నాగార్జున ఉన్నారు.

## గిరిజనులకు ఐటీడీఏ పీవో రాల్ అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవి

- బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొడాలి శ్రీనివాస్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 23, ప్రజాజ్యోతి,** గిరిజనుల సంక్షేమం కొరకు ముఖ్యంగా విద్యా, వైద్యం, ఆదివాసి గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు, కోయ భాషను నేర్చుకోవడమే కాక గిరిజనుల పట్ల చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎంతో అభజనందనీయమని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొడాలి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో భద్రాచలంలోని బార్ అసోసియేషన్ సభ్యులందరూ కలిసి పీవో రాల్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గిరిజనుల సంక్షేమానికి ఎనలేని సేవలు అందించారని, ముఖ్యంగా గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించారని అలాగే జిపిఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టడం, ప్రైమరీ పాఠశాల విద్యార్థుల కొరకు కెరీర్ గైడెన్స్, క్రీడాకారులకు అధునాతనమైన క్రీడా పరికరాలు అందిచారన్నారు. అలాగే ఎస్ హెచ్ జి మహిళలు, గిరిజన మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల నిత్యవసర సరుకులు, గిరిజన రైతుల ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, జిసిసి ద్వారా అటవీ ఉత్పత్తులు నేరుగా ప్రజలకు అందించే విధంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేత భద్రగిరి మార్ట్ తో పాటు గిరిజన మ్యూజియం ప్రారంభించిన ఘనత ఐటీడీఏ పీవో రాల్‌కే దక్కిందన్నారు. బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్, కోశాధికారి రాము, సీనియర్ న్యాయవాదులు ప్రసాద్, మంత్రి ప్రగడ గణపతి, పలివెల నరసింహారావు, పడిశిరి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, రవి, నరసింహమూర్తి, సురేష్ కుమార్, నరేష్, రవితేజ, రామ్మోహన్రావు, సంధ్య, అంజలి పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు బిఆర్ ఎస్ సంఘీభావం

- బిఆర్‌ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ ఐనవోలు పవన్ కుమార్



**చర్ల, ఏప్రిల్ 23: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గురువారం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు చర్ల బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ ఐనవోలు పవన్ కుమార్ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ, 2023 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి మర్చిపోయింది కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల కష్టాలను అర్థం చేసుకోకుండా ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, వెంటనే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు ఆర్టీసీ కార్మికులు అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు.కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ ఎంతకాలం కార్మికులను మభ్యపెడుతారని ప్రశ్నించారు.రాష్ట్ర సాధనలో అగ్రభాగాన ఉన్న ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు.ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడానికి ఈ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని అన్నారు.మండే ఎండల్లో తమ డిమాండ్ల నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన తెలిపే కార్మికుల స్వేచ్ఛ హక్కులను కూడా ఈ ప్రభుత్వం కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు.నీడ కోసం టెంట్లు కూడా వేసుకొనివ్వకుండా పోలీసులు ఆపడం దారుణమన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను,సమస్యలను పరిష్కరించాలని ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని గురువారం నుండి విద్యార్థులకు పాఠశాల సెలవులు గురుకుల పాఠశాల నుండి ఇంటికి వచ్చే విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రజలను కార్మికుల బాధలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందిం చి సమస్యలు పరిష్కరించాలని లేని ఎడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు.

# పద్మశాలీలు రాజకీయ శక్తిగా ఎదగాలి

- పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 23, ప్రజాజ్యోతి**

రాష్ట్రంలో పద్మశాలీలు రాజకీయశక్తిగా ఎదిగిన నాడే మనకు గుర్తింపు ఉంటుందని పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు పేర్కొన్నారు. భద్రాచలంలో గురువారం భద్రాచలం పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో పద్మశాలీలు వెనుకబాటుతనం వల్ల మనకు ఇతర కులాల మాదిరిగా ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు ఎక్కువగా అందడం లేదని, మనలో ఐఖ్యత పెరిగితే అది మన కులానికి బలంగా మారి మనకు ప్రయోజనం చేకూర్చుతుందని అన్నారు. పద్మశాలీకులస్తులందరూ మీ స్థానిక ప్రాంతాల్లో జరిగే వివిధ ఎన్నికల్లో స్వచ్ఛందంగా పోటీ చేసిన నాడే మనకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పద్మశాలీలు తమ ఐక్యతను చాటి కుల సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం భద్రాచలం పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షులు జివివి సుదర్శన రావు, అధ్యక్షులు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావులు మాట్లాడుతూ భద్రాచలం డివిజన్‌లో పద్మశాలీలాల అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులందరం ఐక్యగా కలిసి కృషి చేద్దామని, భద్రాచలం పట్టణం లో ఉన్న పద్మశాలీలందరం ఐక్యంగా కలిసి ఒకే కుటుంబంగా మెలగాలన్నారు. సభ్యత్వ నమోదు, సంఘం తరపున చేపట్టే కార్యక్రమాలకు అందరూ తగిన సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం భద్రాచలం పట్టణ పద్మశాలి సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ జి వి వి సుదర్శన్ రావు, అధ్యక్షులుగా సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరరావు, కోశాధికారిగా రవీందర్‌తో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్ర రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పెరి వెంకట హరి హర కిషన్, సంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం కార్యదర్శి సోమ రమేష్, పట్టణ పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆహార భద్రతపై పటిష్ట మైన చర్యలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఆహార భద్రత అధికారి శరత్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 23,(ప్రజా జ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఆహార భద్రత శాఖ విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆహార భద్రత అధికారి శరత్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2025 నుండి ఇప్పటివరకు జిల్లాలోని మణుగూరు, చెర్ల, దుమ్ముగూడెం, అశ్వారావుపేట, అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపహాడ్, పాల్వంచ తదితర మండలాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరీలు, స్వీట్స్ షాపులు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలపై నిరంతర తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు.ఈ తనిఖీలలో భాగంగా వివిధ ఆహార పదార్థాలపై సర్వైలెన్స్ నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు పంపిస్తున్నామని తెలిపారు. ఆహార భద్రత నిబంధనలు ఉల్లంఘించిన 42 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించామని తెలిపారు, లోపాలు గుర్తించిన సంస్థలకు ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేసి, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వెల్లడించినట్లు తెలిపారు, ప్రజల ఆరోగ్య విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన ఆయన, జిల్లాలోని అన్ని ఆహార విక్రయ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 2025 నుండిఎన్ఫోర్స్మెంట్ సాంపిల్స్ – 70సర్వైలెన్స్ సాంపిల్స్ – 105మొత్తం తనిఖీలు 210నాణ్యత లోపం కేసులు – 21అసురక్షిత ఆహార కేసులు – 9లైసెన్స్ మేళాలు – 3జారీ చేసిన లైసెన్సులు – 111జారీ చేసిన రిజిస్ట్రేషన్లు – 343ఇంప్రూవ్మెం ట్ నోటీసులు – 15పరిష్కరించిన కేసులు – 12వసూలు చేసిన జరిమానా – 53,000ప్రత్యేక డ్రైవ్స్ – 6 ఉన్నట్లు వివరించారు, ప్రజలు కూడా ఆహార భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని శరత్ కోరారు. ఎక్కడైనా అశుభ్రత, కల్తీ లేదా నాణ్యతలేని ఆహారం విక్రయం జరుగుతున్నట్లు గమనించినట్లయితే పాల్వంచలోని ఐ డి ఓ సి కార్యాలయంలో ఎఫ్ 3 గదిలో ఉన్న ఆహార భద్రత కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందుబాటులో ఉండేలా ఆహార భద్రత శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

## విదేశాల్లో ఉద్యోగాల కోసం గిరిజన యువత దరఖాస్తు చేసుకోండి



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 23 , ప్రజా జ్యోతి,** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ హైదరాబాద్ ద్వారా ఆస్ట్రేలియా, జర్మనీ, ఓమన్ వంటి విదేశాలలో ఉద్యోగాల కోసం గిరిజన నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. స్ప్రే పెయింటర్ ఉద్యోగాల కొరకు 100 ఖాళీలు, ప్యానల్ బీటర్ ఉద్యోగాల కొరకు 100 ఖాళీలు కలవని, ఐటిఐ డిప్లొమా మెకానికల్ ఇంజనీరింగ్ లో ఏడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని, సంవత్సరానికి 48 లక్షల చొప్పున వేతనం ఉంటుందని, ఆటోమేటిక్ మెకానిక్ లగ్జరీ కార్స్ ఉద్యోగాల కొరకు వంద ఖాళీలు కలవని, ఐటిఐ డిప్లమా మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమేటివ్ మెకానిక్ లో ఏడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. సంవత్సరానికి 48 లక్షల రూపాయల వేతనం ఉంటుందని, వెల్డర్ పోస్టులో వంద ఖాళీలు కలవని, ఎస్ఎస్సి ఇంటర్ డిప్లొమా ఇన్ బిల్డింగ్ ఫ్యాబ్రికేషన్ మెకానికల్ రిలేటెడ్ ట్రేడర్స్ లో ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని, సంవత్సరానికి 48 లక్షల రూపాయల వేతనం ఉంటుందన్నారు. అలాగే ట్రాన్స్‌మిషన్ లైన్ టెక్నీషియన్ పోస్టులో 20 ఖాళీలు కలవని, ఐటిఐ డిప్లమా బ్యాచులర్స్ లో కనీసం రెండు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని, సంవత్సరానికి 36 లక్షల రూపాయల వేతనం ఉంటుందని, ఎలక్ట్రీషియన్ పోస్టులో 120 ఖాళీలు కలవని, ఐటిఐ ఎలక్ట్రిషన్ లో రెండు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని, సంవత్సరానికి 33 లక్షల రూపాయల వేతనం ఉంటుందని, నర్సెస్ పోస్టులో 90 ఖాళీలు కలవని, బిఎస్సి నర్సింగ్ లేదా జిఎన్ ఎమ్ కోర్సు చేసి ఉండాలని, సంవత్సరానికి 24 లక్షల రూపాయల వేతనం ఉంటుందని అన్నారు. కావున ఆసక్తి, అర్హత గల గిరిజన నిరుద్యోగ యువత ఆధార్ కార్డు, కులం, పాస్పోర్ట్, స్టడీ పత్రాలతో ఈనెల 27, 28 తేదీలలో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని భవిత సెల్ లో దరఖాస్తులు చేసుకోగలరని ఆయన కోరారు.

## ప్రభుత్వ మొండివైఖరితోనే ఆర్టీసీ సమ్మె

- కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి: ఎమ్మెల్యే కూనంనేని

**కొత్తగూడెం, ఏప్రిల్ 23 ( ప్రజాజ్యోతి )** ప్రభుత్వ మొండివైఖరి కారణంగానే ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. గురువారం ఆయన నివాసంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కార్మికులపై కఠిన వైఖరి సరికాదని వారి పొట్టకొట్టే చర్యలను మానుకోవాలని సూచించారు. సమ్మె కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకముందే ప్రభుత్వం చర్చలు ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో అసెంబ్లీలో కార్మికుల పక్షాన గళం వినిపిస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల కోసం తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# హైకోర్ట్ తీర్పుపై బి.ఆర్.ఎస్ సంబరాలు





- **కేసీఆర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మెచ్చా**

**దమ్మపేట, ఏప్రిల్ 23(ప్రజాజ్యోతి):** కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్‌కు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ బిఆర్ఎస్ నాయకులు దమ్మపేటలో సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు.మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దంపతుల పెళ్లిరోజు సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరపున అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ పార్టీ కుట్రలు బయటపడ్డాయని విమర్శించారు. రైతుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యమని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం కష్టపడ్డ ఇంజినీర్ల శ్రమకు ఇది గౌరవమన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీల అమలు పక్కన పెట్టి కేసీఆర్‌పై విమర్శలకే పరిమితమవుతున్నారని అన్నారు. పరిపాలన చేయలేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై న్యాయవ్యవస్థ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల తీర్పుతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొడ్డ రమేష్, సర్పంచ్ కొమరం సుశీల, దారా యుగంధర్, గాజుబోయిన ఏసుబాబు, అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ శ్రీనివాస్ రావు, దారా రాము, గోళ్ళ భవనీ కృష్ణయాదవ్, రూపా రాంబాబు, కౌలూరి నాగయ్య, మండవ సత్య, కాసిని శ్రీను, మద్దెల పుల్లారావు, వెలుగోటి మహేష్, దండాబత్తుల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సేవలకు అభినందనలు

- **దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డిని సత్కరించిన పాస్టర్స్ కమిటీ**




**దమ్మపేట, ఏప్రిల్ 23(ప్రజాజ్యోతి):** మండలంలో శాంతి భద్రతలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంలో కృషి చేస్తున్న దమ్మపేట సబ్ఇన్‌స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డిని బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నియంత్రణ చర్యలు, యువతలో మత్తు పదార్థాల వినియోగం తగ్గించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలు, 'అరైవ్–అలైవ్' వంటి అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని ప్రజలకు అవగాహన కల్పించాలని పాస్టర్లను కోరారు.దీనికి స్పందించిన కమిటీ సభ్యులు తమ సంఘాల ద్వారా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సెబాస్టియన్, ఉపాధ్యక్షుడు యేసురత్నం, కార్యదర్శి క్రాంతి కుమార్, జాయింట్ సెక్రటరీ జకర్యా, పెద్దలు నిరీక్షణరావు, దైవప్రసాద్, రవిబాబు, జాన్‌బాబు, రమేష్ జాషువా, శ్యాంబాబు, తిమోతి, ప్రసాద్, ఇశ్రాయేలు, జోషెఫ్, లారెన్స్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణపై క్షేత్ర పరిశీలన

- **ఆధునిక యంత్రాలను పరిశీలించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు**



**దమ్మపేట, ఏప్రిల్ 23, ప్రజాజ్యోతి :** వ్యవసాయ కళాశాల విద్యార్థులకు మండలంలోని జమిందార్ బంజర గ్రామంలో వ్యవసాయ యాంత్రీకరణపై ప్రాయోగిక అవగాహన కల్పించేందుకు వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షేత్ర పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డా.జె. హేమంత కుమార్ ఆధ్వర్యంలో జాతీయసేవా పథకం విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు మద్దినేని వెంకట్ ఆయిల్ పామ్ తోటను సందర్శించిన విద్యార్థులు, తోటల్లో వినియోగిస్తున్న ఆధునిక వ్యవసాయ యంత్రాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ మట్టలను నూర్పిడి చేసే యంత్రం, గెలలు కోసే యంత్రం, అలాగే గెలలను లోడ్ చేసేందుకు ఉపయోగించే యంత్రాల పనితీరును సమీక్షించారు. ఈ పరిశీలన ద్వారా వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాముఖ్యత, సమయఆదా, శ్రమతగ్గింపు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో డా.నాగాంజలి, డా. జంబమ్మ, డా. శిరీష, డా.ఝాన్సీరాణి, డా. కృష్ణతేజ డి. స్రవంతి పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలు


- **పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘన నిర్వహణ**




**పాల్వంచ, ఏప్రిల్ 23, ప్రజాజ్యోతి:** పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఏప్రిల్ 23న ఆంగ్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 23న విలియం షేక్స్పియర్ జన్మదినం, మరణదినం కావడం విశేషం. అలాగే యునెస్కో ఆచరణ ప్రకారం ఈ రోజును ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా షేక్స్పియర్ ఆంగ్ల సాహిత్యానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. మాధవి, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ టి. అరుణ కుమారి, అధ్యాపకులు డాక్టర్ సి. లీల సౌమ్య, శ్రీ ఇ. భాను ప్రవీణ్ పాల్గొన్నారు. ఇతర విభాగాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు షేక్స్పియర్ రచనల ప్రాధాన్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

## ఆపదలో ఉన్న మహిళకు అరుదైన 'బి నెగటివ్' రక్తం అందజేత

- **పదోసారి అరుదైన 'బి నెగిటివ్' రక్తం దానం చేసిన ట్రస్ట్ సభ్యులు చిరంజీవి రాథోడ్**



**భద్రాచలం టౌన్ ఏప్రిల్ 23 ప్రజా జ్యోతి,** ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. అరుదైన రక్త గ్రూపు దొరకక ఇబ్బంది పడుతున్న ఒక మహిళకు సకాలంలో రక్తాన్ని అందించి ప్రాణదాతగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. ఏలూరు జిల్లా కుకునూరు మండలం మిట్టగూడెం గ్రామానికి చెందిన సత్యవేణి అనే మహిళ ప్రమాదవశాత్తూ కింద పడటంతో ఆమె ఎముక విరిగింది. చికిత్స నిమిత్తం ఆమెను భద్రాచలం పట్టణంలోని నేతాజీ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే, ఆపరేషన్ నిర్వహించాలంటే ఆమె శరీరంలో తగినంత రక్తం లేదని, అత్యవసరంగా రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. సత్యవేణిది అరుదైన 'బి నెగటివ్' బ్లడ్ గ్రూప్ కావడంతో, ఆ రక్తం కోసం కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించినా లభించలేదు. ఈ విషయం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధుల దృష్టికి రావడంతో వారు వెంటనే స్పందించారు. ట్రస్ట్ సభ్యుడు భూక్య చిరంజీవి రాథోడ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో సత్యవేణి కోసం రక్తదానం చేశారు. చిరంజీవి ఈ విధంగా అరుదైన రక్తాన్ని దానం చేయడం ఇది 10వ సారి కావడం విశేషం. సకాలంలో స్పందించి రక్తాన్ని అందజేసి ప్రాణాపాయం నుంచి తప్పించిన రక్తదాత చిరంజీవికి, సహకరించిన మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు బాధితురాలి బంధువులు మరియు వైద్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గురుకుల బాలుర కళాశాలలో ఘనంగా పేరెంట్స్ మీట్

- **విద్యార్థుల ప్రతిభకు బహుమతులు – తల్లిదండ్రులకు ప్రగతి నివేదిక**
- **వృత్తి విద్యతో స్వయం ఉపాధి అవకాశాలు పొందాలని సూచన**






**అ న్నపురెడ్డిప ల్లి, ఏప్రిల్ 23, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలుర కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల భాగంలో వెల్ఫేర్ వీక్ నాలుగో రోజు సందర్భంగా గురువారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ టి. బాలరాజు 2025-26 విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా పాఠశాల, కళాశాల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు ప్రతి తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసి, ప్రతి సబ్జెక్టులో అభ్యాసం మెరుగుపడే విధంగా ఇంటివద్ద సాధన చేసి రావాలని సూచించారు. మండల ఎంపీడీవో కావూరి మహాలక్ష్మి హాజరై వృత్తి విద్యా విభాగం విద్యార్థులకు ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇతర సర్టిఫికెట్లు అందజేశారు. చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులు అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థులను అభినందించారు. ఈ సమావేశంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సిద్దల పుల్లారావు, కార్యదర్శి రమాదేవి, వృత్తి విద్యా ట్రైనర్ జె. దయాకర్, వైస్ ప్రిన్సిపల్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు ప్రసాదు, గోపయ్య, జి. వెంకటేశ్వరరావు, పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సిఆర్పిఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాం





**చర్ల, ఏప్రిల్ 23:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం కింద సిఆర్పిఎఫ్ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం నగర పోలీస్ కమిషనర్ సందీప్ పాటిల్, డిప్యూటీ కమిషనర్ హనుమంతరాయ, లక్ష్మీ గణేష్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ గౌడ, బజ్పే పోలీస్ ఇన్స్పెక్టర్ పరశివ మూర్తి, సూరత్కల్ పోలీస్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ కె.జి .కమాండెంట్–218 బెటాలియన్ మహమ్మద్ ఖాలిద్ ఖాన్, అసిస్టెంట్ కమాండెంట్ ఎఫ్/218 సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జార్పల్లి గ్రామంలో సర్పంచ్ పారా, స్కూల్ పారా, మోర్చా పారా ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 250 మంది గ్రామస్తులకు చీరలు, లుంగీలు, , చెప్పులు, దోమతెరలు, వ్యవసాయ పనిముట్లు (గెంటి, పార), సోలార్ లాంతర్లు, గొడుగులు, నీటి డ్రమ్‌లు, పాత్రలు, గ్లాసులు, వంట సామగ్రి పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్సిల్స్, పెన్సిల్ బాక్స్‌లు అందజేశారు. క్రీడల కోసం క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ సెట్‌లు కూడా పంపిణీ చేశారు.అదేవిధంగా, 218 బెటాలియన్ వైద్య అధికారి డాక్టర్ రాహుల్ పి. నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరిమిత వైద్య సదుపాయాలు ఉన్న గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడం ఈ శిబిరం లక్ష్యం. వైద్య బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సాధారణ వ్యాధులపై పరీక్షలు చేసి, వైద్య సలహాలతో




పాటు ఉచిత మందులు అందజేసింది.మహిళలు, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అలాగే పరిశుభ్రత, పోషణ, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. చర్మవ్యాధులు, పిల్లల వ్యాధులు, ఎముకల సమస్యలు, వడదెబ్బ, కలరా, మసూచి , రక్తహీనత, పోషకాహార లోపం, ప్రసూతి సంబంధిత సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ శిబిరం ద్వారా సుమారు 100 మంది గ్రామస్తులు లబ్ధి పొందారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో అసిస్టెంట్ కమాండెంట్ సునీల్ కుమార్, ఇన్స్పెక్టర్ (జీడీ) దీపక్ తోమర్, ఇన్స్పెక్టర్ (జీడీ) నితేష్ కుమార్ తదితర సిబ్బంది కీలక పాత్ర పోషించారు.

## పాల్వంచ జయమ్మ కాలనీలో మిషన్ భగీరథ పైప్లైన్ భారీ లీక్

- భయాందోళనలో నివాసులు"



**పాల్వంచ, ఏప్రిల్ 23, ప్రజాజ్యోతి:** పాల్వంచ జయమ్మ కాలనీలో బైపాస్ రోడ్డుపై మిషన్ భగీరథ పైప్లైన్ మరోసారి భారీగా లీక్ కావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. గతంలో రెండు సార్లు మరమ్మతులు చేపట్టినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని స్థానికులు తెలిపారు. ఈరోజు పైప్లైన్ ఫెయిల్ కావడంతో నీరు అధిక పీడనంతో సుమారు 20 అడుగుల ఎత్తుకు ఎగసిపడింది. ఒక్కసారిగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. నాసిరకంగా పనులు నిర్వహించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యలపై అధికారులకు, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా తగిన స్పందన లభించలేదని వారు వాపోతున్నారు. అదేవిధంగా సమస్యను సామాజిక మాధ్యమాల్లో ప్రస్తావించిన వారిపై ఒత్తిడి, బెదిరింపులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలను పట్టించుకోవడం లోపిస్తోందని, ఇది సమంజసం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పైప్లైన్ లీక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ఏప్రిల్ 26వ తేదీన బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు



**టేకులపల్లి,ఏప్రిల్23,ప్రజాజ్యోతి:** భవిష్యత్ కాలజ్ఞాన ప్రభోదకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు టేకులపల్లి గ్రామంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఈ నెల 26న నిర్వహించనున్నారు.బ్రహ్మంగారి 333వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఆలయం శోభాయమానంగా ముస్తాబవుతోంది. వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఆదివారం ఈ నెల 26న ఈ మహోత్స వాలను ఘనంగా నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.విశ్వకర్మ వంశానికి చెందిన పుణ్య దంపతులు ప్రకృతాంబ, పరిపూర్ణయాచార్యులకు పుత్రునిగా జన్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబను వివాహ మాడి కాలజ్ఞానాన్నిరచించి భూత, భవిష్యత్, వర్తమాన విషయాలను జగత్తుకు తెలియజేశారు. 1693 సంవత్సరంలో వైశాఖ శుద్ధ దశమి నాడు సజీవ సమాధి పొందిన స్వామి వారు భక్తుల ఆరాధ్యదైవంగా నిలిచారు.

## పువ్వాడ అజయ్‌ను విమర్శించే నైతిక హక్కు బాలసానికి లేదు: రావులపల్లి రాంప్రసాద్



**భద్రాచలం, ఏప్రిల్ 23, ప్రజా జ్యోతి:** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌ను విమర్శించే నైతిక స్థాయి బాలసాని లక్ష్మీనారాయణకు లేదని రావులపల్లి రాంప్రసాద్ విమర్శించారు. ఖమ్మం మమతా కళాశాలలో నిర్వహించిన సభకు ప్రజల నుంచి విశేష స్పందన రావడాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మమతా కళాశాల స్థల ఆక్రమణలపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు, రాష్ట్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్న నేపథ్యంలో దమ్ముంటే పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఆయన సవాల్ విసిరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన రెవెన్యూ, వ్యవసాయ, ఆర్థిక మంత్రులు ప్రభుత్వంలో ఉన్నారని, విచారణలో ఆరోపణలు నిరూపించలేకపోతే అదే మైదానంలో ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పువ్వాడ అజయ్ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన వెంట తిరిగిన బాలసానికి అప్పట్లో ఈ ఆరోపణలు ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. అధికారంలో ఎవరు ఉంటే వారి వైపు నిలబడే రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. పువ్వాడ నాగేశ్వరరావు రాజకీయ ప్రోత్సాహంతోనే బాలసాని ఎదిగారని, ఆ విషయాన్ని మరిచి మాట్లాడటం తగదని రాంప్రసాద్ పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరే నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పువ్వాడ అజయ్ కుటుంబానికి మొదటి నుంచే వ్యవసాయ భూములు, ఆస్తులు ఉన్నాయని, అలాంటప్పుడు ఇతరులపై ఆరోపణలు చేసే ముందు తమ స్థాయి, పరిస్థితులను కూడా ఆలోచించుకోవాలని బాలసానికి హితవు పలికారు.

## నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో జాతీయ ద్వితీయ ర్యాంకు

- పాల్వంచ విద్యార్థిని సాయి భవిష్య శ్రీ ప్రతిభ




**పాల్వంచ, ఏప్రిల్ 23, ప్రజాజ్యోతి:** ఒలింపియాడ్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పోటీ పరీక్షల్లో పాల్వంచ నెహ్రూనగర్‌కు చెందిన అంబడిపూడి నరేందర్, శ్రీలత దంపతుల కుమార్తె సాయి భవిష్య శ్రీ జాతీయ స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని ప్రతిభను పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల జీఎం గోపాల్ రెడ్డి, ఈ–టెక్నో ఆర్ & డి హెడ్ అనిల్ కుమార్, ఈ–చాంప్స్ ఆర్ & డి హెడ్ స్వాతి లక్ష్మి, ఏజీఎం రాంకీ చేతుల మీదుగా సాయి భవిష్య శ్రీకి కంప్యూటర్ ట్యాబు, మెడల్, షీల్డ్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైన పాల్వంచ నుంచి జాతీయ స్థాయి ర్యాంకు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థిని విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, క్రమశిక్షణతో కూడిన విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజ వేయడానికి, విలువలతో కూడిన విద్య అందించడంలో నారాయణ యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పూరేటి నరసింహరావు, ఈ–టెక్నో కోఆర్డినేటర్ ప్రవీణ్, ఈ–చాంప్స్ కోఆర్డినేటర్ వినోద లక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎర్రజెండా పిలుపు... ఉద్యమాలకు సిద్ధం కావాలి

- పంచిన భూములు గుంజుతున్న ప్రభుత్వం!
- మోడీ సర్కారు రైతు వ్యతిరేక విధానాలపై గర్జన
- భూమి కోల్పోతే రైతు భవిష్యత్తే ప్రశ్నార్థకం
- కమ్యూనిస్టులు పంచిన భూములు తిరిగి కోల్పోతున్న పేదలు
- భూ సంస్కరణలు లేక పోతే అసమానతలు మరింత పెరుగుతాయన్న హెచ్చరిక
- సమ్మెలతో ఉద్యమాలను ఉధృతం చేయాలని నేతల పిలుపు
- రైతు ఐక్యతకు వేదికైన మహాసభ విజయవంతం











**కొత్తగూడెం, ఏప్రిల్ 23 ( ప్రజాజ్యోతి )** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా పేదలకు లక్షలాది ఎకరాల భూములను పంచిన కమ్యూనిస్టులు నేడు అదే భూములను పాలకులు గుంజుకుంటున్నారని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు అశోక్ దావలే ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలు దేశానికి ప్రమాదకరమని వాటిని ఎదుర్కొనేందుకు ఐక్యసంఘటనా పోరాటాలు అత్యవసరమని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సామినేని రామారావు నగర్‌లో గురువారం ప్రారంభమైన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభలో ఆయన ప్రసంగించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో దావలే మాట్లాడుతూ కొత్తగూడెంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సామినేని రామారావు, కాసాని ఐలయ్యలకు నివాళులు అర్పించారు. పోడు భూముల హక్కుల కోసం పోరాడిన భూమిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కొనియాడారు. సింగరేణి సంస్థలో ఉద్యోగుల సంఖ్య 1.17 లక్షల నుంచి 40 వేలకే పడిపోవడం ప్రభుత్వాల విధానాల వైఫల్యమని విమర్శించారు. ప్రైవేటీకరణతో సింగరేణి మనుగడే ప్రశ్నార్థకమైందన్నారు. సింగరేణికి బొగ్గు గనులు కేటాయించాలని రూ.50 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది ప్రాణత్యాగం చేసి పది లక్షల ఎకరాల భూములను పేదలకు అందించారని గుర్తుచేశారు. కానీ నేడు పేదల భూములను ప్రభుత్వాలే గుంజుకుంటున్నాయని విమర్శించారు. గ్రామీణ భారతంలో 20 శాతం ధనిక రైతుల చేతుల్లో 80 శాతం భూములు కేంద్రీకృతమవడం తీవ్ర అసమానతలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు ప్రకటిస్తున్న మద్దతు ధరలు బూటకమయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణలో మొక్కజొన్నకు ఏమ్.ఎస్.పి కంటే రూ.750 తక్కువ ధర లభిస్తోందని వరికి ప్రకటించిన రూ.2,370కు బదులు పచ్చి వడ్లకు కేవలం రూ.1300 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కేరళలో మాత్రం క్వింటాకు రూ.3,000 చెల్లిస్తున్నారని ఉదాహరణగా చెప్పారు. ఎమ్.ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం C2+50 మద్దతు ధర ఇవ్వాలని రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మూడు వ్యవసాయ చట్టాలను రైతుల పోరాటం ద్వారా వెనక్కి తీసుకోవాల్సి వచ్చినట్లు గుర్తుచేశారు. విదేశాంగ విధానంలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు.

### ››› హామీలు అమలు చేయడంలో మోడీ విఫలం :- విజ్జు కృష్ణన్

ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ 11 ఏండ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను మోడీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. రైతుల భూములను బలవంతంగా గుంజుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీల అమలులో విఫలమైందన్నారు.

### ››› ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన :- తమ్మినేని వీరభద్రం

మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పోరాడితేనే దోపిడీదారులను ఎదుర్కోగలమన్నారు. మే 4 తర్వాత డీజిల్, గ్యాస్ ధరలు పెరిగే అవకాశముందని హెచ్చరించారు. వ్యవసాయానికి గిట్టుబాటు ధరలు లేకపోవడం రైతుల పరిస్థితిని మరింత దెబ్బతీస్తోందన్నారు.

### ››› మే 15న దేశవ్యాప్తంగా సమ్మె :- బి. వెంకట్

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ మాట్లాడుతూ మే 15న దేశవ్యాప్తంగా ఉపాధి కార్మికుల సమ్మె నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. లేదంటే హైదరాబాద్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

### ››› రైతు భరోసా కోతలపై విమర్శలు :- టి. సాగర్

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ రైతు భరోసా నిధుల కోతలపైనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని విమర్శించారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన వారిలో సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సీనియర్ నేతలు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాద్, జంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, రైతు సంఘం మహిళా విభాగం కన్వీనర్ కందాల ప్రమీల, రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు యలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు న్యాయవాది శివరాంప్రసాద్, ఆదివాసీ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, ప్రజా సంఘాల నేతలు శ్రీరాం నాయక్, ఆశయ్య, ఉడుత రవీందర్, అన్నవరపు కనకయ్య, ఏజే రమేశ్, మచ్చా వెంకటేశ్వర్లు, ఎమ్. జ్యోతి, బంతు రాంబాబు, కె. పుల్లయ్య, కె. ధర్మా, వెంకట్, కె. బ్రహ్మచారి, బుర్రి శ్రీరాం, అన్నవరపు సత్యనారాయణ, పిట్టల రవి, కార్పొరేటర్ సీహెచ్. శ్రావణి తదితరులు ఉన్నారు.



